క్లుప్తంగా

మే డే కార్యక్రమాలను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

టెక్కలి: మే ఒకటో తేదీన టెక్కలిలో నిర్వహించనున్న కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎన్.షణ్ముఖరావు కోరారు. ఈ మేరకు సోమవారం టెక్కలిలో వివిధ సంఘాల కార్మికులతో కరపత్రాలను ఆవిష్కరించారు. ఉదయం తొమ్మిది గంటలకు కార్మికులంతా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు చేరుకోవాలని.. అక్కడ నుంచి ర్యాలీ చేపట్టనున్నట్టు వెల్లడించారు. అలాగే మే 20న దేశ వ్యాప్తంగా చేపట్టనున్న సమ్మె జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు



ధనలక్ష్మి

కాశీబుగ్గ: కంచిలి గ్రామానికి చెందిన బొడ్డేపల్లి ధనలక్ష్మి మూడు రోజులుగా కనిపించకుండా పోయిందని కుటుంబసభ్యులు కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈమెకు మతిస్థిమితం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిస్తే 9676333108, 9347985107 నంబర్లకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

సజ్జలను కలిసిన పూడి నేతాజీ



సజ్జలతో నేతాజీ..

కవిటి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వయిజర్ కమిటీ చైర్మన్ సజ్జల రామకృష్ణారెడ్డిని కవిటి వైస్ ఎంపీపీ పూడి నేతాజీ విజయవాడలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా అధికార ప్రతినిధిలో హోదాలో నేతాజీ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను రామకృష్ణారెడ్డికి వివరించారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ల నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

టెక్కలి: టెక్కలి మండల గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్ల నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షునిగా కూర్మాపు సంధ్య, ఉపాధ్యక్షులుగా పొన్నాడ సూర్యనారాయణ, పృథ్వీ, ప్రధాన కార్యదర్శిగా మడపాల సుదర్శన్, కార్యదర్శిగా బెండి మనోజ్, కోశాధికారిగా దానుపురం ప్రదీప్, లక్ష్మణ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

కవిటి: మండలంలోని కొజ్జిరియా పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న వై.రాజేష్ కంచిలి మండలం అంపురం పంచాయతీ కార్యదర్శిగా ఇటీవల బదిలీ అయ్యారు. దీంతో ఆయన్ని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చోడి పంట సాగుపై రైతుల ఆసక్తి



ఆశాజనకంగా ఉన్న చోడి పంట

ఇచ్ఛాపురం రూరల్: ప్రజల ఆరోగ్యం దృష్ట్యా చిరు ధాన్యాల వినియోగం, సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లో సుమారు 200 ఎకరాల్లో చోడి పంటను సాగు చేస్తున్నట్లు సోంపేట వ్యవసాయ ఉప సంచాలకులు జగన్మోహనరావు తెలిపారు. చోడి సాగుకు పెట్టుబడి తక్కువ. రబీలో వెద పద్ధతిలో ఎకరా విస్తీర్ణంలో చోడి పంట సాగుకు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు ఖర్చవుతోందన్నారు. ఎకరాకు మూడు నుంచి ఐదు క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తోందని చెప్పారు. చోడి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. విత్తనాలు అందజేస్తున్నామన్నారు.

30న చందనోత్సవం



లక్ష్మీనరసింహ స్వామి విగ్రహం

ఆమదాలవలస రూరల్: ఈ నెల 30వ తేదీన మండలంలోని దివంజీపేట గ్రామంలో గల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో చందనోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ అర్చకుడు సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వకరించాలన్నారు.

రైతన్నా మేలుకో.. భూమిని దున్నుకో!

- వేసవి దుక్కులతో భూమికి సారం
- మెరుగైన దిగుబడులకు దోహదం



ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న రైతు

కవిటి:

ఖరీఫ్ సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. దీని కోసం రైతులు ఇప్పటి నుంచే సమాయత్తం అవుతున్నారు. అయితే సీజన్ ప్రారంభానికి ముందు వేసవి దుక్కులతో భూమిని సిద్ధం చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇలా చేసుకోవడం ద్వారా మెరుగైన పంట దిగుబడులు సాధ్యమని చెబుతున్నారు. సాధారణంగా చాలామంది రబీ సీజన్ తరువాత పొలాలను ఖాళీగా ఉంచేస్తారు. దీంతో ఖరీఫ్ సీజన్ ప్రారంభ సమయానికి కలుపు, ఇతర గడ్డి జాతి మొక్కలు భూమిలో పెరిగిపోవడం, పురుగు మందుల అవశేషాలు కూడా భూమి లోపల ఉండిపోవడం ద్వారా ఖరీఫ్ సీజన్‌లో వేసుకునే పంటలకు కావల్సిన లోతైన బీజపీఠం ఏర్పడదు. దీంతో దిగుబడి తగ్గుతుంది.

వేసవి దుక్కులకు ప్రాధాన్యత



నాగలితో పొలాల్ని దున్నుచేస్తున్న దృశ్యం

రబీ సీజన్ పూర్తయిన తర్వాత చేసే లోతు దుక్కులను వేసవి దుక్కులు అంటారు. ఎంత లోతుగా దుక్కి దున్నుకోవాలనేది మనం వేయబోయే పంటనుబట్టి ఉంటుంది. మొక్కజొన్న, జొన్న, వేరుశనగ మొదలగు పంటల వేర్లు మధ్యరకంగా లోతు ఉంటే 15–20 సెంటీమీటర్ల లోతు సరిపోతుంది. ముఖ్యంగా దున్నే విధానాన్ని, నేల స్వభావాన్ని బట్టి ఎంచుకోవాలి. లోతుగా నేలను తిరగబడేటట్టుగా దున్నాలనుకుంటే కొయ్య నాగలిని వినియోగించాలి. అలాగే రోటోవేటర్‌లను వాడి కూడా గడ్డి, గరికను భూమిలో కలియదున్నవచ్చు. లోతుగా దున్నేటప్పుడు గట్టిపార విచ్ఛిన్నమై నేల గుల్లగా తయారవడమే కాకుండా నేలలో గాలి శాతం, నీటిని పీల్చుకునే లక్షణాలు పెరగడం ద్వారా సూక్ష్మజీవుల సంతతి, చర్యలు పెరుగుతాయి. దీనివల్ల నేలలోని సేంద్రియ పదార్థాలు త్వరగా విచ్ఛిన్నమై పోషకాలుగా విడుదల అవుతాయి. కలుపు మొక్కల వేర్లు, పురుగు మందుల అవశేషాలు నేలలో ఉంటాయి. వీటిని లోతు దుక్కులు చేయడం ద్వారా విష పదార్థాలు విచ్ఛిన్నమై పంటల దిగుబడి పెరుగుతుంది. వర్షపు నీరు లోపలి పొరల్లోకి ఇంకి భూమి సారాన్ని పెంచుతుంది. వేసవి దుక్కి చేయడం ద్వారా కలుపు మొక్కలన్నీ వేర్లతో పెకిలించి నేల లోపలి పొరల్లోకి చేరతాయి. దీని వలన సూర్యరశ్మి సోకి కలుపు మొక్కల విత్తనాలు నిర్వీర్యం అవుతాయి. వేసవి దుక్కి దున్ని నేలను తిరగవేయడం వలన నేలలోని చీడపురుగులన్నీ నేలపైకి రావడం వలన పక్షులు వాటిని తిని చంపి వేస్తాయి. వేసవిలోని అధిక ఉష్ణోగ్రతలకు తట్టుకోలేక చనిపోతాయి. వేసవి దుక్కుతో అనేక లాభాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రైతులు అశ్రద్ధ చేయకుండా వేసవి దుక్కులు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

అధిక దిగుబడులు, నేలసాగుకు దోహదం



ఖరీఫ్ వ్యవసాయ పనులకు రైతన్న సిద్ధమవుతున్నాడు. వాతావరణ శాఖ అంచనాలతో మే మొదటి వారం నుంచే వర్షాలు పడొచ్చు. ఈ తరుణంలో బీలప్రాంత రైతులు వేసవి దుక్కులు చేసేందుకు ఇది మంచి తరుణం. మెట్ట భూముల రైతులు అదనుచూసి దుక్కులు లోతుగా చేసుకోవాలి. దీని ద్వారా దమ్ము చేసే సమయంలో అనుకూలంగా వరినాట్లు వేసుకునే వీలుకలుగుతుంది. మెరుగైన దిగుబడులకు వేసవి దుక్కులు తొలిమెట్టుగా చెప్పవచ్చు. – కె.జగన్మోహనరావు, ఏడీఏ, సోంపేట సబ్‌డివిజన్

80 లీటర్ల సారా స్వాధీనం

- ముగ్గురు అరెస్టు



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

సోంపేట/ మందస: సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సోంపేట, మందస మండలాల్లో సోమవారం దాడులు నిర్వహించి 80 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకోవడంతోపాటు 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ కె.బేబి తెలిపారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు చెప్పారు. సోంపేట మండలంలోని కొరంజి బద్ర గ్రామంలో 80 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని ఎస్.రాము, డి.కేశబో, ఎస్.కమాండోను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే మందస మండలంలోని పట్టులోగాంలో 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు పేర్కొన్నారు.

భయపెట్టిన ఉరుములు!

వజ్రపుకొత్తూరు రూరల్: వాతావరణంలో సోమవారం సాయంత్రం సంభవించిన మార్పులతో ప్రజలు భయాందోళన చెందారు. అప్పటి వరకు ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి కాగా సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై వాతావరణం చల్లబడింది. దీంతో హమ్మయ్య అనుకున్న కొద్ది సేపట్లోనే ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన తేలికపాటి వర్షం పడింది. అయితే వర్షంతోపాటు పెద్ద శబ్దంతో ఉరుములు రావడంతో జనం ఆందోళన చెందారు. పంట పొలాలు, జీడి తోటల్లో ఉన్న రైతులు భయంతో ఇళ్లకు పరుగులు తీశారు.

స్టాక్ పాయింట్‌కి చేరిన పాఠ్య పుస్తకాలు



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర ద్వారా అందించనున్న ఉచిత పాఠ్యపుస్తకాలు మండల స్టాక్ పాయింట్‌కి చేరుకున్నాయని ఎంఈవోలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మండల స్టాక్‌పాయింట్‌కి 2025–26 విద్యా సంస్థరానికి సంబంధించి మొదటి విడతగా 32,162 పాఠ్యపుస్తకాలు సోమవారం వచ్చాయన్నారు. వీటిని సమగ్రశిక్షా ఉద్యోగులు తరగతులవారీగా వేరు చేశారు. పాఠ్యపుస్తకాలు అధికారులు పరిశీలించారు.

ఇద్దరు యువతులు అదృశ్యం

కాశీబుగ్గ: పలాస మండలం రెంటికోట, నీలిబద్ర గ్రామాలకు చెందిన 21, 19 ఏళ్ల వయస్సు ఉన్న ఇద్దరు యువతులు అదృశ్యమైనట్టు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని కాశీబుగ్గ పోలీసులు సోమవారం తెలిపారు. రెంటికోటకు చెందిన యువతి పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు మొగిలిపాడు గ్రామంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద పని చేసేందుకు వెళ్లి తిరిగిరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే నీలిబద్ర గ్రామానికి చెందిన యువతి మేడపై పడుకోవడానికి వెళ్లి కనిపించకుండా పోయిందన్నారు. ఈమెకు మందస మండలానికి చెందిన వ్యక్తితో నిశ్చితార్థం సైతం అయ్యింది. రెండు ఫిర్యాదులపై కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ మిస్సింగ్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి సిరిమానోత్సవం



అసిరితల్లి అమ్మవారు



మాకివలసలో అసిరితల్లి ఆలయం

నరసన్నపేట: మండలంలోని మాకివలసలో మంగళవారం నుంచి అసిరితల్లి సిరిమాను పండగ మహోత్సవాలు జరగనున్నాయి. 38 ఏళ్ల తరువాత అమ్మవారి పండగలు నిర్వహిస్తున్నారు. 1987 పండగలు నిర్వహించారు. మే 7వ తేదీతో పండగలు ముగుస్తాయి. పండగల సందర్భంగా సోమవారం సనప చాటే కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం మాకివలస సమీప కాంచీపేటకు వెళ్లి మానుకు బొట్టు పెడతారు. ఈ కార్యక్రమం ఉదయం 8 నుంచి 10 గంటల మధ్య నిర్వహిస్తారు. గ్రామంలో అమ్మవారి పండగ సందడి ప్రారంభమైంది. పంచాయతీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. మంచినీటి సదుపాయం మెరుగుపరిచారు. విద్యుత్ లైట్లు మరమ్మతులు చేస్తూ కొన్నిచోట్ల విస్తరించినట్లు సర్పంచ్ రావాడ మోహనరావు తెలిపారు. సరిమాను ఉత్సవాలు ప్రశాంతగా నిర్వహించాలని గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు సహకరించాలని కిళ్లాం డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, సర్పంచ్ మోహన్‌రావు, ఎంపీటీసీ యాళ్ల అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ యాళ్ల వేణుగోపాలరావు కోరారు. ఆరో తేదీన సిరిమాను ఊరేగింపు ఉంటుందన్నారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబర్చిన బ్రహ్మ

మందస: మందస మండలం హరిపురం గ్రామానికి చెందిన వమ్మరవెల్లి బ్రహ్మ విజయవాడ జగ్గయ్యపేటలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. 85 కిలోల కేటగిరీలో ద్వితీయ స్థానంలో సిల్వర్ పతకంతోపాటు రూ. 2,500 నగదు బహుమతి గెలుచుకున్నారు. బ్రహ్మను జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్ ప్రసాద్, గౌరీ శంకర్ పలువురు కోచ్‌లు అభినందించారు.

ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలలో నిరుపేద విద్యార్థులకు 2025–26 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంఈఓ వెంకటరమణ సోమవారం తెలిపారు. అర్హులైన పేద విద్యార్థులు ఉచిత విద్యను పొందాలంటే మే 15వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు, అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు ఐదు శాతం, షెడ్యూల కులాలకు పది శాతం సీట్లు కేటాయిస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు గ్రామ సచివాలయాలు, మీ సేవా కేంద్రాలు, ఇంటర్నేట్ కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఫీజులపై కానరాని నియంత్రణ

- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు సంతోష్‌కుమార్



కాశీబుగ్గ: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల నియంత్రణ లేకుండా పోయిందని వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు బమ్మిడి సంతోష్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. పలాసలో విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. ఫీజుల నియంత్రణపై అనేక రకాల ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదన్నారు. 1994లో వచ్చిన జీవో నంబర్ ఒకటి, 2009లో వచ్చిన జీవో నంబర్–91ను అమలు చేయలేమని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు కోర్టుకు వెళ్లాయని గుర్తు చేశారు. ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను వినియోగించడం లేదన్నారు. షూ, టై, బెల్టు అమ్మే వ్యాపార కేంద్రాలుగా మారినా చర్యలు తీసుకోకుండా అధికారులు చేతులెత్తేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జీవో ఎంఎస్ నంబర్ 53ను పొందుపరుస్తూ ఒకటి నుంచి పదో తరగతి ఫీజుల వివరాలు పొందుపరిచారని గుర్తు చేశారు. దీంతో తల్లిదండ్రులపై ఫీజులు భారం తగ్గిందన్నారు. కూటమి సర్కార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా తాత్సారం చేస్తుండడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

నువ్వలరేవు రోడ్డు పూర్తి చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండల కేంద్రానికి ప్రధాన రోడ్డు అయిన టెక్కలిపట్నం నుంచి బెండి గేటు మీదగా నువ్వలరేవు వరకు అసంపూర్తిగా ఉన్న డబుల్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని సీఐటీయూ, ఆటో కార్మిక యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ ఎన్.మోహన్‌రావు, ఆటో కార్మిక యనియన్ నాయకులు బి.రాజు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయంలో ప్రారంభమైన డబుల్ రోడ్డు పనులు నేటికీ పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు గుంతలుగా మారి రాళ్లు తెలడంతో ప్రయాణం నరకంగా మారిందన్నారు. అధికారులు, కూటమి నాయకులు ఇదే రోడ్డుపై నిత్యం ప్రయాణిస్తున్న స్పందించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులు పునఃప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సీతారామయ్యకు వినతిపత్రం అందజేశారు. ప్రజా సంఘ నాయకులు బి.అనందరావు, గణపతి, సుగుణ, ఆర్.తిరుపతి, కె.వెంకటరావు, బి.గోపాలరావు ఉన్నారు.

బస్ షెల్టర్‌కు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు

కవిటి: ఇద్దివానిపాలెం గ్రామంలో బస్‌షెల్టర్ నిర్మాణానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షులు కడియాల ప్రకాష్, ఎంపీటీసీ సభ్యులు ఎరిపిల్లి రామయ్య, దుద్ది సతీష్, సర్పంచ్ జి.రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతు, శేషయ్య పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయానికి స్థల పరిశీలన



సూదికొండలో స్థల పరిశీలన చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ మంజునాథ్

కాశీబుగ్గ: పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సోమవారం కేంద్రీయ విద్యాలయ అసిస్టెంట్ కమిషనర్ మంజునాథ్ స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూదికొండకు ఆనుకొని ఉన్న ఈ స్థలం నిర్మాణానికి అనువుగా ఉందన్నారు. 2025–26 సంవత్సరంలో తరగతులు ప్రారంభించేందుకు రైల్వే పాఠశాల భవనాలను పరిశీలించారు. కేంద్ర క్యాబినెట్‌లో ఆమోదం వచ్చాక పలాసలో తరగతులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, తహశీల్దారు కళ్యాణ చక్రవర్తి, ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ లక్ష్మణరావు, బీసీ సెల్ అధ్యక్షులు లొడగల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పహల్గామ్ మృతులకు కొవ్వొత్తులతో నివాళి



పలాస-కాశీబుగ్గ మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొవ్వొత్తులతో సోమవారం నివాళులర్పించారు. తొలుత కాశీబుగ్గ గాంధీ విగ్రహం నుంచి కేటీ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. సంక్షేమ సంఘం అధ్యక్షులు ఐ.ఎం.రావు తదితరులు పాల్గొన్నారు. -కాశీబుగ్గ

దళితులకు న్యాయం చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీపీ శ్రీరామమూర్తి తదితరులు

నందిగాం: పెద్దలవునిపల్లి పంచాయతీ చిన్న లవునిపల్లిలో నిరుపేద దళితుల ఇళ్లు కూల్చి రహదారి ఏర్పాటు చేయకుండా ప్రత్యమ్నాయ ఏర్పాటు చేసి న్యాయం చేయాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి కురమాన బాలకృష్ణారావు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ సోమేశ్వరరావును పలువురు దళితులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నలవునిపల్లి దళిత వీధిలో రహదారి ఉంటుండగా మరో రహదారి ఏర్పాటు చేయాలనే నేపంతో అడ్డంగా ఉన్న దళితుల ఇళ్లు కూల్చివేయాలని చూస్తున్నారని తెలిపారు. కూటమి నాయకుల ఒత్తిడితో అధికారులు, పోలీసులు గ్రామానికి చేరుకొని దళితులను ఆందోళనకు గురి చేస్తున్నారన్నారు. రోడ్డు ఏర్పాటు తప్పనిసరి అనుకుంటే తరాలుగా నివాసం ఉంటున్న ఇళ్లు కూల్చకుండా పక్కనుంచి వేసుకునేలా చర్యలు తీసుకోని దళితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయ ఏవోకు కూడా వినతపత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, జద్యాడ జయరాం, అంబోడి విష్ణు తదితరులు ఉన్నారు.

విశ్రాంతి భవనం ప్రారంభం



కంచిలి మండలం కొల్లూరు పంచాయతీ పరిధి గుండాం గ్రామంలో ప్రయాణికుల విశ్రాంతి భవనాన్ని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. దీన్ని పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 4 లక్షలు, మండల పరిషత్ సాధారణ నిధులు రూ. 3 లక్షలతో నిర్మించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, స్థానిక సర్పంచ్ పైల రేఖాలక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు లడ్డు కేశవపాత్రో, దుర్గాసి ధర్మారావు, కొణపల సురేష్ కుమార్, తలగాన తిరుపతి, మద్దు వెంకటరావు, పైల గణేష్ రెడ్డి, పైల మాధవరావు, రంగాల కృష్ణారావు పాల్గొన్నారు. -కంచిలి

రక్తదాతకు సత్కారం



ఇచ్ఛాపురం మండలం ఎం.తోటూరుకు చెందిన రక్తదాత పాతిర్ల గిరిబాబురెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఇప్పటివరకు ఆయన వివిధ బ్లడ్ బ్యాకులకు 13 సార్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్తు నరేంద్ర యాదవ్, కవిటి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కడియాల ప్రకాశ్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి సల్ల దేవరాజు, బి.గొనపపుట్టుగ సర్పంచ్ బద్రి ప్రకాశ్, దట్టి అజయ్, శ్రీరామ్, నర్తు శివాజీలు గిరిబాబును సత్కరించారు. -ఇచ్ఛాపురం రూరల్

వేసవి శిక్షణ శిబిరం..



టెక్కలి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి బి.రూపావతి కోరారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభించి మాట్లాడారు. సెలవుల్లో గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేసుకొని విజ్ఞానాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయాధికారి జి.ప్రసాదరావు, ఉపాధ్యాయులు టి.వైకుంఠరావు, పాఠకులు పాల్గొన్నారు. -టెక్కలి